## క్లుప్తంగా

### మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి



ఎర్రవల్లిలో జెండా ఎగురవేస్తున్న ముదిరాజ్‌లు

మర్కూక్(గజ్వేల్): జాతీయ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో సోమవారం మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఎగురవేశారు. అనంతరం సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జీవనోపాధి కోసం ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తుందని, దీంతో మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యభిక్షపతి, ఎంపీటీసీ ధనలక్ష్మి కృష్ణ, ముదిరాజ్ సంఘం నాయకులు సత్యం, స్వామి, శ్రీను, బాలచంద్రం, వెంకట్, సత్తయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

### డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ తదితరులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంతో పాటు మండల పరిధిలో 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు డ్రైవింగ్ లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పలువురి నుంచి దరఖాస్తు స్వీకరించిన అనంతరం వారు మాట్లాడుతూ.. జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సొంత డబ్బులతో ప్రతి యువకుడికి ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సు ఇప్పిస్తున్నారని, ఈ అవకాశాన్ని పట్టణ, మండల పరిధిలోని యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్టీఏ నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ రాజీవ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఎల్లారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీధర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ప్రశంస పత్రాలు



విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వేచరేణి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం చింతోజు బ్రహ్మయ్య బాలల సంస్థ సిరిసిల్ల వారు ప్రశంస పత్రాలు అందించారు. పాఠశాల ఉపాధ్యాయుడు రామచంద్రమూర్తి స్వీయ నిర్వహణ, సంపాదకీయ శిక్షణలో విద్యార్థులు రాసిన వేచరేణి వెలుగులు అనే పుస్తకం రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన సందర్భంగా విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏనుగుల దుర్గయ్య మాట్లాడుతూ.. విద్యతో పాటు ఇతర అంశాలపై విద్యార్థి అభిరుచి, ఆసక్తిని పెంచుకున్నప్పుడే సమగ్ర వ్యక్తిత్వ వికాసం పొందినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కే.వీ.ఎస్.రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ యాదగిరి, ఉపాధ్యాయులు నరహరి, పరమేశ్వరయ్య, విమలాకర్, హరిప్రసాద్, పాషా తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీకి నేతల శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తదితరులు

గజ్వేల్‌రూరల్: ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి జన్మదినం సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం క్యాసారంలో మొక్కలు నాటి, పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌తో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గోవర్ధనగిరి గొంతెండుతోంది..

- మాజీ ఉపసర్పంచ్‌తో కలిసి కాలనీవాసుల ఆందోళన
- పరికిబండలో నెలకొన్న గేట్‌వాల్ రిపేర్
- లింగారెడ్డిపల్లిలో నిరుపయోగంగా ట్యాంక్



లింగారెడ్డిపల్లిలో భగీరథ పైపు వద్ద ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

అక్కన్నపేట(హుస్నాబాద్): తాగునీరు రాక సరిగా ఎనిమిది రోజులు గడిచింది. దీంతో గోవర్ధనగిరి వాసులు గుక్కెడు నీటికి అల్లాడుతున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల పక్కన ఉన్న ట్యాంక్ ద్వారా గ్రామంలో కొంతమేరకు నీరు అందుతోంది. అవి సరిపోవడం లేదు. అయితే గోవర్ధనగిరి, పరికిబండ, లింగారెడ్డిపల్లిలో మిషన్ భగీరథ కింద మూడు ట్యాంకులు నిర్మించారు. అందులో పరికిబండ, లింగారెడ్డిపల్లిలో ట్యాంక్‌లోకి నీటిని ఎక్కించే పైపులు ఎక్కడికక్కడా తెగిపడ్డాయి. అవి మరమ్మతు చేసి నీళ్లు ట్యాంక్‌లో ఎక్కించాల్సి ఉంది. పరికిబండలో వాటర్ ట్యాంక్ నిర్మించి వృథాగా పడి ఉంది. ఇంటింటికీ నల్లా కనెక్షన్లు కూడా ఇవ్వలేదు. ఇది మండలంలోని పరిస్థితి అని గోవర్ధనగిరి మాజీ ఉపసర్పంచ్ మెడబోయిన సారయ్య, కాలనీవాసులు సోమవారం ఆందోళన నిర్వహించి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడుతూ.. పరికిబండలో ఏర్పాటు చేసిన ట్యాంక్‌కు స్కూల్ పక్కన ఉన్న ట్యాంక్ ద్వారా గేట్‌వాల్ తిప్పితే నిండుతుంది. కానీ గేట్‌వాల్ రిపేర్‌లో ఉండడంతో ట్యాంక్‌లో కూడా నీళ్లు రావడం లేదు. దీంతో గేట్‌వాల్ రిపేర్ చేయాలని అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఎనిమిది రోజులుగా నీటికి తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు వ్యవసాయ పొలాలకు కాలనీవాసులు పరుగులు తీస్తున్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఒకటి, రెండు వాటర్ ట్యాంకర్లను పంపుతున్నా అవీ ఏ మాత్రమూ సరిపోవడం లేదు.



వృథాగా వదిలేసిన భగీరథ వాటర్ ట్యాంక్



గోవర్ధనగిరిలో పాడైన గేట్‌వాల్

### భగీరథ నీళ్లు దేవుడెరక

పరికిబండ, లింగారెడ్డిపల్లిలో మిషన్ భగీరథ నీరు రావడం లేదు. ట్యాంక్‌లోకి నీటిని ఎక్కించే పైపులు ఎక్కడికక్కడా తెగి పడి ఉన్నాయి. తెగిన పైపులు మరమ్మతులు చేసి నీళ్లు ట్యాంక్‌లో ఎక్కించాలని అనేకసార్లు మిషన్ భగీరథ అధికారులకు చెప్పిన నీమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. కాగా పరికిబండలో ఇంటింటికీ నల్లా కనెక్షన్లు కూడా ఇవ్వలేదు. భగీరథ తాగునీరు ఎలా ఉంటాయో చూద్దామంటే కనిపించడం లేదు. మరోపక్క మాత్రం ప్రభుత్వం ఇంటింటికీ భగీరథ నీళ్లు అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించి గేట్‌వాల్ రిపేర్ చేయించి, మిషన్ భగీరథ నీళ్లు కూడా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# ఈవీఎంపై అవగాహన పెంచుకోవాలి

ఆర్డీఓ బెన్ షాలోమ్



హుస్నాబాద్: ఈవీఎంపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ బెన్ షాలోమ్

హుస్నాబాద్: రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానంపై ఆర్డీఓ బెన్ షాలోమ్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఈవీఎం, వీవీ ప్యాడ్ మొబైల్ వ్యాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ బెన్ షాలోమ్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 25వ తేదీ వరకు హుస్నాబాద్ నియోజకవర్గంలోని 306 పోలింగ్ స్టేషన్‌లలో ఈవీఎంల ద్వారా ఓటర్లకు ఓటు వేసే విధానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక ఈవీఎం మిషన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో అందుబాటులో ఉంచుతామని, మరో మిషన్ మొబైల్ వాహనం ద్వారా పోలింగ్ స్టేషన్‌ల వారీగా అవగాహన కల్పిస్తామన్నారు. ప్రతిరోజు మూడు పోలింగ్ స్టేషన్‌లలో మొబైల్ వాహనం ద్వారా ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ రెండు ఈవీఎంలను రాత్రి సమయంలో పోలీస్ స్టేషన్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక ఓటరు అవగాహన పెంచుకొని ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీపీఓ భిక్షపతి, ఎలక్షన్ డీటీ అశోక్, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, వైఎస్సార్‌టీపీ నాయకులు వంగ వెంకట్రాంరెడ్డి, కేడం లింగమూర్తి, బత్తుల శంకర్‌బాబు, వీరాచారి, గడిపె మల్లేశ్, మల్లికార్జున్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



దుబ్బాక: ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సలీంమియా

దుబ్బాక: ఓటర్లకు, నాయకులకు ఈవీఎంలపై కనీస అవగాహన అవసరమని దుబ్బాక తహసీల్దార్ సలీంమియా అన్నారు. సోమవారం దుబ్బాక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్లకు, పలు పార్టీల నాయకులకు ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల పని తీరు, ఓటు వేసే విధానం, నోటాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రతీ గ్రామంలో ఓటు హక్కు, ఓటర్లకు ఈవీఎంలపై ప్రచార రథం ద్వారా అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది శివప్రసాద్, ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

# రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే గెలుపు ఖాయం



ముడుపులు కట్టేందుకు వెళ్తున్న నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): రాబోయే ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి విజయం సాధించి మంత్రి పదవిని చేపట్టాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, ఆలయ చైర్మన్ గీస భిక్షపతి ఆధ్వర్యంలో కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో ముడుపు కట్టారు. సోమవారం జనగామ నుంచి కొమురవెల్లికి ర్యాలీగా వచ్చి ముడుపు కట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో ప్రతి నిత్యం ప్రజాసంక్షేమం కోసం పాటుపడే ఎమ్మెల్యే ముత్తిరెడ్డి విజయం సాధించి మంత్రి పదవిని చేపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సిలివేరు సిద్దప్ప, రమేశ్, శ్రీనివాస్, డీకే సుల్తాన్, రాజా అజ్మీర్ తదితరులు పాల్గొన్నారు.

## శభాష్ సర్పంచ్..

ఇంటింటికీ తిరుగుతూ చెత్త సేకరణ



చెత్త సేకరిస్తున్న సర్పంచ్ మహదేవ్‌గౌడ్

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని దుద్దెడ గ్రామంలో చెత్త పేరుకుపోకుండా సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు(స్థానిక సర్పంచ్) ఆరెపల్లి మహదేవ్‌గౌడ్ సోమవారం ఇంటింటా చెత్త ట్రాక్టర్‌ను తీసుకెళ్లి చెత్త సేకరించారు. సమస్యల పరిష్కారం కోసం మండలంలోని పారిశుద్ధ్య కార్మికులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మెకు దిగి 5 రోజులు గడుస్తుంది. ఈక్రమంలో దుద్దెడలోని 15 మంది పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో ఉండడంతో గ్రామంలో ఎవరి ఇంట్లో చెత్త వారింట్లోనే పేరుకుపోతుండటంతో ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో సర్పంచ్ స్వయంగా గ్రామ పంచాయతీ చెత్త ట్రాక్టరును ఇంటింటికీ తీసుకెళ్లి చెత్తను సేకరించి డంప్‌యార్డుకు తరలించి శభాష్ అనిపించుకున్నారు. ఈ సందర్భంగా మహదేవ్‌గౌడ్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. అసలే వర్షాకాలం చెత్త పేరుకుపోవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఏర్పడకుండా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.

## పేదల పక్షాన పోరాడతాం

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మోహన్

చిన్నకోడూరు(సిద్దిపేట): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతూ పేద ప్రజలకు అండగా నిలుస్తామని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మోహన్ అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నియంతపాలన కొనసాగిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో సిద్దిపేటలో బీఎస్పీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. బీఎస్పీ ఎదుగుదలను జీర్ణించుకోలేని కొంత మంది అగ్రవర్ణ నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వారికి తగిన బుద్ధి చెబుతామన్నారు. సమావేశంలో నాయకులు లింగంపల్లి యాదగిరి, వెంకటేశ్, బాబు, అశోక్, శంకర్, నరేశ్, సంజీవ్, నీరజ, మల్లేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలి

చేర్యాల(సిద్దిపేట): మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎంఈఓ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులతో ధర్నా నిర్వహించిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. అదేవిధంగా కోడిగుడ్లకు అదనంగా డబ్బులు చెల్లించి, సరిపడా వంట గ్యాస్ సబ్సిడీ ధరలకు అందించాలన్నారు. కనీస వేతనం రూ.26 చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు బిల్లులు రాక ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు కరీం, ఐలయ్య, సరస్వతి, వెంకటవ్వ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డి సంఘం కార్యవర్గం ఎన్నిక

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామ రెడ్డి సంఘం సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండం ముత్తారెడ్డి, ఉపాధ్యక్షుడిగా రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొండం నరోత్తంరెడ్డి, కార్యదర్శిగా రాజిరెడ్డి, కోశాధికారిగా రాకేశ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా సంతోష్‌రెడ్డి, సత్యనారాయణ రెడ్డిలను ఎన్నుకున్నారు.

# నిందితులను అరెస్ట్ చేయాలి

కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్

జగదేవ్‌పూర్(గజ్వేల్): దళితుల పట్ల కుల వివక్ష పాటించిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి వెంటనే నిందితులను అరెస్టు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్ అన్నారు. సోమవారం కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ, దళిత ప్రజాఫ్రంట్ సంఘాల నాయకులు తిమ్మాపూర్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాణిక్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్‌లు మాట్లాడుతూ.. దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కులం పేరుతో అవమా న పరిచిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం ప్రకారం సమాజంలో అందరూ సమానమేనని, గ్రామంలో ఇతర కులాల వారు దళితులపై కుల వివక్ష చూపడం దారుణమన్నారు. పౌరహక్కుల దినోత్సవం నిర్వహించి అవగాహన కల్పించాలని కోరారు. నిందితులపై చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బాలకిషన్, ఉపాధ్యక్షుడు నవీన్, కృష్ణమూర్తి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి, డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏగొండస్వామి, రాజు, ఎల్లయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతోనే నాయకత్వ లక్షణాలు

సిద్దిపేటరూరల్: ప్రతీ విద్యార్థికి నాయకత్వ లక్షణాలు క్రమశిక్షణతోనే సాధ్యమవుతాయని సిద్దిపేట వన్‌టౌన్ ఎస్ఐ నర్సింహారావు, ప్రముఖ వైద్యురాలు సుహాసినిలు అన్నారు. సోమవారం సిద్దిపేట శివారులోని కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు పట్టాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వారు హాజరై మాట్లాడారు. చిన్నతనం నుంచే పాఠశాలలో చదువుతో పాటు ఆటలు, ఇతర అంశాలపై దృష్టి సారించడంతో భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి ఎదిగేందుకు అవకాశం ఉందన్నారు. దీనికి కేంద్రీయ విద్యాలయాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బ్యాడ్జీలు, ఫ్లాప్స్, ప్లకార్డులు అందజేసి బాధ్యతలు అప్పగించారు. అంతకుముందు విద్యార్థులకు క్రీడాదుస్తులు అందజేశారు. విద్యార్థులు వారికి కేటాయించిన బాధ్యతలను క్రమశిక్షణతో నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మార్కండేయులు, ఉపాధ్యాయులు భూమయ్య, వంశీ, రాహుల్, ప్రవింధ్య, షాహీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ యోగా చేయాలి

సిద్దిపేటజోన్: ప్రతి ఒక్కరూ యోగా తప్పనిసరిగా చేయాలని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు సూచించారు. సోమవారం టీచర్స్ కాలనీలో వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని వార్డుల్లో యోగా తరగతులు చేపట్టాలని మంత్రి హరీశ్‌రావు సూచనలు చేశారని పేర్కొన్నారు. శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, శిక్షకులు సతీశ్, అంజయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



హరితహారంపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

హుస్నాబాద్: ప్రభుత్వం హరితహారం ద్వారా లక్షలాది మొక్కలను పంపిణీ చేస్తుందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. సోమవారం పట్టణంలోని 4వ వార్డులో కళాబృందాల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, పరిశుభ్రత, పచ్చదనంపై పాటల రూపంలో వార్డు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలందరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కో ఆప్షన్ సభ్యుడు అయూబ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాషా, స్థానికులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

హుస్నాబాద్‌రూరల్: కాంగ్రెస్ హయాంలోనే పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందారని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి పందిల్ల గ్రామంలో గడపగడపకూ ప్రవీణ్‌రెడ్డి కార్యక్రమంలో పాల్గొని పేదల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని చెప్పి మోసం చేయడమే కాకుండా ఎస్సీల భూములను తీసుకొని వారికి భూమి లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెస్తే మళ్లీ సంక్షేమం వస్తుందని అందరూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మండల అధ్యక్షుడు చందు, అయిలయ్య, వైస్ ఎంపీపీ దేవసాని నిర్మల నర్సింహారెడ్డి, సర్పంచ్‌లు ముత్యాల సంజీవరెడ్డి, రాజిరెడ్డి, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, రాజు, పున్న లావణ్య సది పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



కొండపాకలో శిబిరం వద్ద మాట్లాడుతున్న కనకాచారి

కొండపాక(గజ్వేల్): సమస్యల పరిష్కారం కోసం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు చేపట్టిన సమ్మెకు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మూడోజు కనకాచారి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి అమ్ముల బాల్‌నర్సయ్య, నాయకులు పోషయ్య, నరహరి తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): జీఓ.నం 51ని సవరించి, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ సర్పంచ్‌లు ముత్యాల సంజీవ్‌రెడ్డి, బద్దం రాజిరెడ్డి, ఎంపీటీసీలు బైరగోని పుష్పలీల, భూపతి సుదేష్ణ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అక్కన్నపేట మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపడుతున్న కార్మికుల సమ్మె సోమవారం నాటికి 5వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు వారి సమ్మెకు సంఘీభావం తెలిపారు.

### ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): జీపీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్‌పీ) జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు పెద్ద మాతరి లక్ష్మన్ మహారాజ్ డిమాండ్ చేశారు. మిరుదొడ్డిలో జీపీ కార్మికులు చేపట్టిన సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు.

చేర్యాల(సిద్దిపేట): తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జీపీ కార్మికులు చేపట్టిన సమ్మెకు సీఐటీయూ జిల్లా నాయకురాలు, మాజీ జెడ్పీటీసీ దాసరి కళావతి మద్దతు తెలిపింది.

## సంక్షిప్త వార్తలు

◆ **లూయిస్ దాగురేకు నివాళి**

కొమురవెల్లి(సిద్దిపేట): కెమెరా సృష్టికర్త లూయిస్ దాగురే వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని కొమురవెల్లి మల్లన్న స్వామివారి రాజగోపురం ఎదుట ఫొటో వీడియోగ్రాఫర్స్ అధ్యక్షుడు చిప్ప శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముద్దం విజయ్, ముద్దం రవి, మంకాల రమేశ్, ఎక్కలదేవి నరేశ్, కొంక మహేశ్, దువ్వల మల్లేశ్, రేణికుంట మహేందర్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **విస్తృతంగా ఆర్టీసీ సేవలు**

రాయపోలు(దుబ్బాక): గ్రామ గ్రామాన ఆర్టీసీ సేవలను విస్తరిస్తున్నట్లు గ్రామస్థాయి ఆర్టీసీ అధికారులు ఎంఎస్ గౌడ్, జయేందర్‌రెడ్డి, కృష్ణ, సిద్దిరాంలు అన్నారు. దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లి నుంచి బేగంపేట మీదుగా గజ్వేల్ వరకు బస్సు సర్వీసును సోమవారం వారు మాచిన్‌పల్లిలో ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదమ్మ, ఉపసర్పంచ్ నర్సింలు పాల్గొన్నారు.

◆ **12న జాతీయ కార్యవర్గ సమావేశం**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని అధినేత మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈ నెల 12న వరంగల్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఎస్సీ రిజర్వేషన్ అనుబంధ సంఘాల జాతీయ కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ ముంద్రాతి కృష్ణ మాదిగ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో ప్రధాని మోదీతో ఎస్సీ రిజర్వేషన్‌పై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ జాతీయ కార్యవర్గ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్‌తో పాటుగా ఇతర రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

◆ **వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శిగా నరేశ్**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హైదరాబాద్‌లోని కేంద్రీయ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ ప్రాంత సమావేశాల్లో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శిగా బుస్స నరేశ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కార్యదర్శి పండరినాథ్‌లు నియామకపత్రాలను అందించారని ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి గ్యాదరి రాజారాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అప్పగించిన పనులను బాధ్యతతో పూర్తి చేస్తానని నరేశ్ తెలిపారన్నారు.

◆ **బంద్‌ను విజయవంతం చేయండి**

దుబ్బాక: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 12వ తేదీన ఎస్ఎఫ్ఐ, ఎపీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను నిర్వహిస్తున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాధిక్ అన్నారు. బంద్‌కు విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రవికుమార్, స్వామి, ప్రశాంత్ ఉన్నారు.

◆ **కిషన్‌రెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, తొడుపునూరి వెంకటేశం, నరసింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కుమారస్వామి, పరశురాములు, రాజేశం, మార్కండేయులు, రమేశ్‌గౌడ్, రామచంద్రం, నవీన్‌రెడ్డి, హేమంత్, ఆకారం రమేశ్, లతారెడ్డి, మల్యాల శ్రీనివాస్, అచ్యుత్, సురేశ్, బాబు, దేవరాజు పాల్గొన్నారు.

◆ **ఎంపీ పరామర్శ**

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ 3వ వార్డుకు చెందిన మాజీ పీఏసీఎస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి తల్లి భారతమ్మ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి సోమవారం భారతమ్మను పరామర్శించి మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లకు సూచించారు.

◆ **నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి**

మద్దూరు(హుస్నాబాద్): బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడుస్తున్నా నేటికీ నిరుపేదల కుటుంబాలకు ఇళ్లు ఇవ్వలేని దౌర్భాగ్య దుస్థితిలో ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. సోమవారం మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇకనైనా ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయాలని, వాటి నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చి పోరుబాటను కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి యాదగిరి, నాయకులు ప్రశాంత్, మల్లారెడ్డి, ఎల్లయ్య పాల్గొన్నారు.

◆ **ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య**

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని గోదాస్ డెయిరీ ఫార్మ్ ప్రతినిధి హరిందర్‌యాదవ్, సర్పంచ్ రజిత రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వట్టిపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు గోదాస్ డెయిరీ ఫార్మ్, పూర్వ విద్యార్థి సత్యనారాయణ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులను అందించారు. ముందుగా పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని అనూషకు రూ.10వేలు, ద్వితీయ స్థానం వచ్చిన విద్యార్థిని బ్లెస్సీకి రూ.5వేల నగదు బహుమతి అందించారు.

◆ **హక్కుల సాధనకు ఏకం కావాలి**

సిద్దిపేటఅర్బన్: హక్కుల సాధనకు గౌడ జర్నలిస్టులు ఏకం కావాల్సిన అవసరం ఉందని నియోజకవర్గస్థాయి గౌడ జర్నలిస్ట్ సంఘం అధ్యక్షుడు మరుపల్లి స్వామిగౌడ్ అన్నారు. సోమవారం గౌడ జర్నలిస్ట్ సంఘం నూతన కార్యవర్గాన్ని సిద్దిపేట ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా మరుపల్లి స్వామిగౌడ్(ప్రజాపక్షం), గౌరవ అధ్యక్షుడిగా వడ్లకొండ శ్రీనివాస్‌గౌడ్ (జన జాగృతి), ఉపాధ్యక్షులుగా సాయిగౌడ్ (ఎన్టీవీ), నరేశ్‌గౌడ్ (ఎస్ఎస్‌సీ), ప్రధాన కార్యదర్శిగా యాదగిరిగౌడ్(హెచ్ఎంటీవీ), జాయింట్ సెక్రటరీగా గిరిబాబు గౌడ్ (ఏబీఎన్), కోశాధికారిగా సీహెచ్ నరేశ్(ఎస్ఎస్‌సీ), ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీనివాస్(అవని), సలహాదారులుగా మహేందర్‌గౌడ్ (ఆంధ్రజ్యోతి), కార్యవర్గ సభ్యులుగా అశోక్ (రాజ్‌న్యూస్), సతీశ్(సాక్షి), శ్రీనివాస్ (అవని), పరశురాములుగౌడ్, రజనీకాంత్‌గౌడ్, నర్సింలుగౌడ్, రాకేశ్‌గౌడ్ పాల్గొన్నారు.